నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 17 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# ముందస్తు అరెస్ట్



కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

కాసిపేట, డిసెంబర్ 16 : అసెంబ్లీ సమావేశాలు పున:ప్రారంభమవుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ముత్యంపల్లి మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌కు వెళ్లి ఎక్కడ ఆందోళనలు చేస్తారనే భయంతోనే ముందస్తు అరెస్ట్‌లు చేస్తున్నారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎంత అభద్రతా భావంలో ఉందో దీనిని బట్టి తెలుస్తుందన్నారు. తెల్లవారు జామున ఐదు గంటలకే ఇళ్లకు వచ్చి అరెస్ట్‌లు చేయడం దారుణమన్నారు. పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరితే ఎప్పుడు పడితే అప్పుడు ముందస్తు అరెస్ట్‌లు చేయడం సరైనది కాదని మండిపడ్డారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు.

# పెండింగ్ బిల్లులు చెల్లించాలి

## అసెంబ్లీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, డిసెంబర్ 16 : గ్రామ పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు రాక మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు ఈ ప్రభుత్వం ఎలా బిల్లులు చెల్లిస్తుందని మంత్రి సీతక్క అనడం సరికాదన్నారు. ఎంపీపీ, జడ్పీటీసీల గౌరవ వేతనాలు కూడా విడుదల చేయాలని కోరారు.


పులి దాడిలో గాయపడ్డ సురేశ్‌ను పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

# సురేశ్‌కు పది లక్షల పరిహారమివ్వాలి

## బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కౌటాల, డిసెంబర్ 16 : పులిదాడిలో గాయపడ్డ రైతు సురేశ్‌కు రూ. 10 లక్షల పరిహారమివ్వాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సిర్పూర్(టీ) మండలం దుబ్బగూడ గ్రామానికి చేరుకొని సురేశ్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సురేశ్ పేద కుటుంబానికి చెందినవాడని, భూమి కౌలుకు తీసుకొని వేసిన పత్తిని తీసేందుకు వెళ్లినప్పుడు ఈ ఘటన జరగడం బాధాకరమన్నారు. సురేశ్ భార్య ధైర్య సాహసాలు గొప్పవన్నారు. సురేశ్ ఇంటిలో కనీసం విద్యు త్ బల్బు కూడా లేదని, బీఆర్‌ఎస్ నాయకులే ట్యూబ్ లైట్లు తెచ్చి పెట్టారన్నారు. మా పార్టీ చీకటిలో ఉన్న పేదలకు వెలుగునిచ్చే పార్టీ అన్నారు.

### సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల మండల కేంద్రంలో గ్రామ స్థాయి సోషల్ మీడియా సభ్యులతో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ సర్కారులో చేపట్టిన అభివృద్ధి, నేడు గ్రామ స్థాయిలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను సోషల్ మీడియా ద్వారా వివరించాలన్నారు. నియోజకవర్గంలో ఆయన కృషితో సంతూర్ స్కాలర్‌షిప్‌లు ఇప్పించినట్లు తెలిపారు. మనం చేసే ప్రతి సేవా కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆయన వెంట నియోజక వర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, సిర్పూర్, కౌటాల మండలాల బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

బెజ్జూర్, డిసెంబర్ 16 : మండలంలోని పాపన్‌పేట, మర్తిడి గ్రామాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన భోనాల వేడుకల్లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక భోనాల వేడుకలని పేర్కొన్నారు. మర్తిడి గ్రామానికి చెందిన గొల్లపల్లి సత్యనారాయణ సీఆర్పీఎఫ్ ఉద్యోగం సాధించగా, అతడిని శాలువాతో సన్మానించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు బూస సారయ్య, దుర్గం తిరుపతి, ఖాజామోహినుద్దీన్, సలీం, సూర్ల ఇస్తారి, నికాడి మోహన్ తదితరులున్నారు.


అనుమతులు లేకుండా ఫారెస్టు భూమిలో జాతీయ రహదారి-63 విస్తరణ కోసం తవ్విన మట్టి(ఫైల్)

# తవ్వింది కొండంత.. ఫైన్ పిసరంత

## ఎన్‌హెచ్-63 కోసం అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు

- కిలోమీటరున్నర వరకు తీస్తే 10 మీటర్ల నుంచి 15 మీటర్లకే ఫైన్
- ఫిర్యాదు చేస్తే తప్పతోవ పట్టించేలా.. ఎఫ్‌డీవోను తప్పించేలా డీఎఫ్‌వో నివేదిక
- విమర్శల పాలవుతున్న అటవీశాఖ అధికారుల వ్యవహారం
- ఆగిపోయిన పనులను వెంటనే మొదలు పెట్టాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు

*నిజామాబాద్-జగ్దల్‌పూర్ జాతీయ రహదారి-63 పనుల్లో నిత్యం ఎక్కడో చోట అక్రమాలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఎన్‌హెచ్ విస్తరణలో భాగంగా ఇందారం బీట్ పరిధిలో అనుమ తులు లేకుండా ఇరువైపులా కిలోమీటరున్నర వరకూ మీటర్‌కంటే ఎక్కువ వెడల్పుతో మట్టి తవ్వగా, ఆ మొత్తానికి ఫైన్ వేయాల్సింది పోయి కేవలం 10 నుంచి 15 మీటర్ల వరకే లెక్కగట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు మామూళ్లు తీసుకొని సదరు కాంట్రాక్టర్‌కు లక్షలాది రూపాయలు మిగిల్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.*

మంచిర్యాల, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్ నుంచి జగ్దల్‌పూర్ వెళ్లే జాతీయ రహదారి-63 పనుల్లో అటవీ శాఖ అధికారుల వ్యవహారం విమర్శలకు తావిస్తున్నది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓసీపీకి వెళ్లే ఎంట్రన్స్ ఆర్చ్ మొదలుకొని.. బస్టాండ్, అరుణక్కనగర్, పోచమ్మగుడి మీదుగా ఎన్‌హెచ్-363 కలిపే బైపాస్‌రోడ్డు వరకు దాదాపు కిలోమీటరున్నర ఉంటుంది. ఎన్‌హెచ్-63 విస్తరణలో భాగంగా మంచిర్యాల రేంజ్ ఇందారం బీట్‌లో పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతాల్లో ప్రస్తుతమున్న రోడ్డు పక్కన.. అటవీ భూముల్లో మీటర్ కంటే ఎక్కువ వెడల్పుతో మట్టి తవ్వారు. కానీ ఈ పనులు చేసేందుకు అటవీశాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. దీంతో ఫారెస్ట్ అధికారులు వెళ్లి పనులను అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేసినందుకు ఓ వాహనాన్ని సీజ్ చేసి, పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు జరిమానా విధించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా మట్టి తవ్వకాలను ఫైన్ వేసే విషయంలో అటవీశాఖ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తవ్విన మట్టి మొత్తానికి ఫైన్ వేయకుండా తక్కువ మొత్తానికి వేసి కాంట్రాక్టర్‌కు రూ. లక్షలాది రూపాయాలు మిగిల్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### కిలోమీటరున్నర తవ్వితే.. పదిహేను మీటర్లకు కూడా ఫైన్ వేయలే..

రోడ్డు విస్తరణ కోసం అటవీభూములను తవ్విన కాంట్రాక్టర్‌కు దాదాపు రూ. 10 లక్షల వరకు జరిమానా పడాలి. పైగా తవ్విన మట్టిని తరలించిన వాహనాన్ని సీజ్ చేయాలని అటవీ చట్టంలోని నిబంధనలు చెబుతున్నాయి. కానీ మంచిర్యాల అధికారులు మాత్రం సదరు కాంట్రాక్టర్‌కు మేలు చేసేలా వ్యవహరించినట్లు తెలుస్తున్నది. అడవిలో పశువుల కాపర్లు పశువుటు మేపినా, గిరిజనులు వంట చెరుకు తెచ్చుకున్నా కేసులు నమోదు చేసే అధికారులు, ఈ కాంట్రాక్టర్ విషయంలో మాత్రం మామూళ్లు తీసుకొని మిన్నకుండిపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కిలోమీటరున్నర దూరం దాదాపు మీటర్‌కంటే ఎక్కువ వెడల్పుతో ఫారెస్ట్ భూమి తవ్వితే.. మొత్త కలిపి పదిహేను మీటర్ల వరకే తవ్వినట్లు ఫారెస్ట్ అధికారులు కేసును మార్చేశారు. కేవలం 101.25 క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వినట్లు గుర్తించి.. ఆ క్యూబిక్ మీటర్‌కు రూ.971 చొప్పున లెక్కగట్టి రూ.98,314 ఫైన్ వేశారు. ఈ మేరకు డిప్యూటీ రేంజర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా మంచిర్యాల డివిజనల్ ఆఫీసర్ రూ.98,314కు మరో రెండింతలు (వన్ ప్లస్ టూ టైమ్స్) కలుపుకొని రూ.2.94,950 జరిమానా విధించారు. ఇక్కడే గోల్‌మాల్ జరిగింది. మట్టి తవ్వేందుకు ఫాస్ట్ మూవింగ్ వాహనాన్ని వినియోగిస్తే క్యూబిక్ మీటర్‌కు రూ.4016 చొప్పున ఫైన్ వేయాలి. కానీ ఇక్కడ తవ్వకాలను అడ్డుకున్న సమయంలో ఫాస్ట్ మూవింగ్ సీఎల్‌జీ 414 లెవలింగ్ గ్రేడర్ వాహవాన్ని సీజ్ చేసిన ఫారెస్టు అధికారులు.. ఫైన్ మాత్రం ఎడ్లబండితో మట్టి తరలిస్తే వేసే రూ.971 చొప్పున వేశారు. వాస్తవానికి రూ.4016 చొప్పున 101.25 క్యూబిక్ మీటర్లకు ఫైన్ వేస్తే రూ.4,06,620 అవుతుంది. దానికి వన్ ప్లస్ టూ టైమ్స్ కలుపుకుంటే రూ.12,19,860 అవుతుంది. కానీ.. ఇక్కడ కట్టించింది మాత్రం రూ.2.94,950 మాత్రమే. అదే మొత్తం కిలోమీటరున్నరను పరిగణలోకి తీసుకుంటే తవ్విన మట్టి కొన్ని వేల క్యూబిక్ మీటర్లలోకి.. దానికి వేయాల్సిన జరిమానా కోట్ల రూపాయాల్లో ఉంటుంది. కానీ అధికారులు అలా చేయకుండా కేవలం కాంట్రాక్టర్‌కు మేలు చేసేలా వ్యవహరించారని ఈ లెక్కలను చూస్తేనే తెలిసిపోతుంది.

### ఫిర్యాదును తప్పతోవపట్టించిన వైనం..

ఈ వ్యవహారంలో ఇందారం డీఆర్వో, మంచిర్యాల ఎఫ్‌డీవో, ఎఫ్ ఆర్వో, ఇందారం డీఆర్వోల పాత్రపై నయీంపాషా అనే సామాజిక కార్యకర్త 2023లో మంచిర్యాల డీఎఫ్‌వోకు, హైదరాబాద్‌లోని పీసీసీఎఫ్‌కు ఏకకాలంలో ఫిర్యాదు చేశారు. వచ్చిన ఫిర్యాదును డీఎఫ్‌వో ఎవరిపైనైతే ఫిర్యాదు చేశారో ఎంక్వైరీ చేయమని వారికే ఫార్వర్డ్ చేశారు. వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కొన్ని రోజులకు పీసీసీఎఫ్ ఎంక్వైరీ చేసి వారం రోజుల్లో రిపోర్ట్ ఇవ్వాలంటూ డీఎఫ్‌వోను ఆదేశించారు. అప్పుడు స్పందించక తప్పని పరిస్థితుల్లో జిల్లా అధికారులు మేము ఏం తప్పు చేయలేదు. నిబంధనల ప్రకారమే ఫైన్ వేశామంటూ ఉన్నతాధికారులనే తప్పుతోవ పట్టించేలా రిపోర్టును అందజేశారు. ఆ రిపోర్టునే డీఎఫ్‌వో మంచిర్యాల సీసీఎఫ్‌కు ఆయన పీసీసీఎఫ్‌కు పంపించారు. కిలోమీటరున్నర దూరం మీటర్ కంటే ఎక్కువ వెడల్పుతో తవ్వితే 101.25 క్యూబిక్ మీటర్ల మట్టి మాత్రమే వచ్చిందంటే డీఎఫ్‌వోకు ఎందుకు అనుమానం రాలేదు. ఆ రోడ్డును ఆయన పరిశీలించి నివేదికను పైకి పంపించారా లేకపోతే కిందిస్థాయి అధికారులను కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే వారిచ్చిన రిపోర్టును అలాగే ఉన్నతాధికారులు పంపించారా అన్నది అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయింది. కాగా, కొన్ని రోజులకు ఇదే సామాజిక కార్యకర్త పేరుతో ఇదే విషయమై పీసీసీఎఫ్ ఆఫీసులో గుర్తుతెలియని వ్యక్తులు మరో ఫిర్యాదు ఫైల్ చేశారు. దానిపై విచారణ చేసిన డీఎఫ్‌వో అది ఫోర్జరీ సంతకం అని, అసలు ఆ సామాజిక కార్యకర్త ఈ ఫిర్యాదు చేయలేదని రిపోర్టు చేశారు. దీంతో మొత్తం అసలు వ్యవహారాన్నే తప్పుతోవ పట్టించారంటూ సామాజిక కార్యకర్త ఆరోపిస్తున్నారు. నా పేరుపై ఎవరో తప్పుడు ఫిర్యాదు ఇచ్చారు సరే. మరి మొదట నేను ఇచ్చిన ఫిర్యాదును తప్పుతోవ పట్టించేలా రిపోర్టు ఇచ్చిన అధికారులపై విచారణ చేపట్టాలని, వాస్తవాలను గుర్తించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అటవీశాఖ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.


ఫారెస్టు అధికారులు అడ్డుకోవడంతో రోడ్డు పక్కన తవ్విన గుంతలను పూడ్చేసిన దృశ్యం (ఫైల్)

### ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి

అనుమతులు తీసుకోకుండా మట్టి తవ్విన కాంట్రాక్టర్ ఫారెస్ట్ అధికారులు వచ్చి అడ్డుకోవడంతో హడావుడిగా తవ్విన గుంతను పూడ్చేశారు. అప్పటికే కొంత మట్టిన బయటికి తరలించిన కాంట్రాక్టర్‌ను ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా గుంతలు పూడ్చడం ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాలు అందులో దిగబడిపోతున్నాయి. ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు సైతం ఈ గుంతలో దిగబడి తృటిలో ప్రమాదం తప్పింది. ఈ రహదారిపై నెలలో ఐదారు రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకులైన జనాలు మృత్యువాత పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అటవీశాఖ అధికారులు రహదారి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని, వెంటనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మట్టి తవ్వి పూడ్చేసిన గుంతల్లో దిగబడిన లారీ(ఫైల్)



కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం




# కాగజ్‌నగర్‌కు టైగర్ జోన్ ?

## కవ్వాల్ నుంచి ఇక్కడికి మార్చేందుకు ప్రణాళికలు!

- పులులు ఎక్కువగా సంచరించే కాగజ్‌నగర్ -కదంబా అడవులపై ప్రత్యేక దృష్టి
- త్వరలో తడోబా, కన్నెర్‌గాం పులుల సంరక్షణ కేంద్రాలకు అధ్యయన బృందం

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : కవ్వాల్ టైగర్‌జోన్‌ను కాగజ్‌నగర్‌కు మార్చేందుకు అధికారులు దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల జిల్లాలో పర్యటించిన రాష్ట్ర అటవీ శాఖ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి మహారాష్ట్ర నుంచి పులుల రాకపోకలు చేస్తున్న ప్రాంతాలను పరిశీలించింది. కాగజ్‌నగర్ అడవులు పులులకు సురక్షిత ప్రాంతంగా ఉన్నాయనడానికి ఎలాంటి అనుకూలతలున్నాయన్న అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా అధికారులకు వారు సూచించినట్లు తెలుస్తున్నది.

### కవ్వాల్‌లో కానరాని పులుల నివాసం

కవ్వాల్ అభయారణ్యాన్ని 1972 వన్య ప్రాణుల సంరక్షణ చట్టాన్ని అనుసరించి 1999 లో రిజర్వు ప్రాంతంగా మార్చారు. అడవుల్లో శాఖాహార వన్యప్రాణులు సంతతి పెరగడంతో దీనిని పులుల సంరక్షణ ప్రాంతంగా మార్చాలని భావించారు. 2012లో కవ్వాల్ అభయారణ్యాన్ని 42వ పులుల సంరక్షణ కేంద్రంగా ఏర్పాటు చేశారు. వన్యప్రాణుల సంతతిని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. వన్య ప్రాణుల ఆహారం కోసం గడ్డిమైదానాలు, నీటి వసతులు కల్పించారు. అడవుల్లోకి వెళ్లేందుకు ఆంక్షలు విధించారు. ఆడవుల్లోకి వెళ్లే మార్గాల్లో చెక్‌పోస్టులు పెట్టి అడవిదారులను మూసేశారు. కవ్వాల్‌లోకి పులులు వస్తే పూర్తిగా స్వేచ్ఛగా తిరిగేలా చర్యలు చేపట్టారు. పర్యాటకులను ఆకర్షించేందుకు కాటేజీలు వంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. అడవుల్లో పర్యటించేందుకు సఫారీలను ఏర్పాటు చేశారు. దాదాపు 12 ఏళ్లుగా అనేక చర్యలు చేపట్టారు. పులులను ఈ ప్రాంతానికి రప్పించేందుకు అనేక చర్యలు తీసుకుంటూనే ఉన్నారు. కానీ.. ఇంతవరకు పులులు కవ్వాల్ అడవుల్లో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నది లేదు.

### కాగజ్‌నగర్ అడవులు అనుకూలం..!

మహారాష్ట్రలోని తడోబా, తిప్పేశ్వర్, కన్నెర్‌గాంలలో ఉన్న పులుల సంరక్షణ కేంద్రాల నుంచి కొన్నేళ్లుగా పులులు కాగజ్‌నగర్ అడవుల్లోకి విరివిగా రాకపోకలు సాగిస్తున్నాయి. 2015లో మొటిసారి ఫాల్గుణ (పులి) నాలుగు పిల్లలకు జన్మనిచ్చి కదంబా అడవుల్లో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. అప్పటి నుంచి పులుల సంచారం జిల్లాల్లో బాగా పెరిగింది. నిత్యం ఎక్కడోచోట మనుషులపై, పశువులపై పులుల దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాగజ్‌నగర్ అడవులను పులులు సంరక్షణ కేంద్రంగా మార్చడంపై అటవీ అధికారులు దృష్టిసారించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్లుగా పులులు ఆవాసం ఏర్పాటు చేసుకోని కవ్వాల్ అభయారణ్యం కంటే కాగజ్‌నగర్ అడవులను పులుల సంరక్షణ కేంద్రంగా మారిస్తే బాగుంటుందన్న అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. మహారాష్ట్రలోని నుంచి ఇక్కడికి వచ్చే పులులు ఇక్కడే ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులు భావిస్తున్నారు. దట్టమైన అడవుల్లో, పులుల సంచరించే ప్రాంతాల్లో ఉన్న ఆవాసాలను గుర్తిస్తున్నారు. అడవి భూముల్లో సాగు వివరాలను సేకరిస్తున్నారు. కాగజ్‌నగర్ అడవులను పులులకు పూర్తి ఆవాస యోగ్యంగా మార్చేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

### త్వరలో అధ్యయనం కోసం ప్రత్యేక బృందం

పులుల సంరక్షణ కోసం తడోబా, కన్నెర్గాం, తిప్పేశ్వర్ కేంద్రాల్లో అక్కడి అటవీ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.. అడవుల్లో ఎలాంటి ఏర్పాట్లు చేశారు.. అనే విషయాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేసేందుకు ఇక్కడి నుంచి ప్రత్యేకంగా అటవీ అధికారుల బృందాన్ని పంపించనున్నట్లు పీసీసీఎఫ్ డోబ్రివాల్ ఇటీవల కాగజ్‌నగర్ అడవుల్లో పర్యటించిన సందర్భంగా తెలిపారు. పులుల రాకపోకలు ఎక్కువగా సాగిస్తున్న ప్రాణహిత తీరం వెంబడి ఉన్న గ్రామాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు.


కాగజ్‌నగర్ అడవులు

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు


పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

### ఆసిఫాబాద్‌లో సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్

ఆసిఫాబాద్ టౌన్ ,డిసెంబర్ 16 : జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో మొత్తం 18 సెంటర్లు ఏర్పాటు చేశారు. 4393 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, ఉదయం 2397 మంది హాజరు కాగా, 1996 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం 2395 మంది పరీక్ష రాయగా 1998 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర పాఠశాలతో పాటు సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలోని సెంటర్‌ను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తనిఖీ చేయగా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్ వద్ద బందోబస్తును ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణకు కృషి చేసిన సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. రెండు రోజులు నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని, 54 శాతం మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు బీఎన్ఎస్ఎస్163 సెక్షన్ అమలు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు పకడ్బందీ బందోబస్తు నిర్వహించిన సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

### కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్,డిసెంబర్16 : కాగజ్‌నగర్ పట్టణంలోని తొమ్మిది సెంటర్లలో నిర్వహించిన గ్రూపు-2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పోలీసులు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి, బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ మండలాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి అభ్యర్థులను వాహనాల్లో ఉచితంగా కేంద్రాలకు తరలించారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, డిసెంబర్ 16 : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అధికారులు వివరాలు పరిశీలించి, సత్వర చర్యలు తీసుకోవలని సూచించారు.